అవిగో
క్షయగ్రస్తుడైన భర్త
కలుషిత రక్తపు కళ్ళెలతో
భూమి తడిసి పోతుంటే
అమ్మడానికి పుస్తెలేని
అభాగ్యురాలి
దీనార్తనాదాలు.
అవిగో
పులిస్తర్ల కుండీల మూగిన
మన సోదర భారతీయుల
దీన రూపాలు
ఈ దేశ భాగ్యోన్నతికి నిదర్శనాలు
ఓహో నా దేశం
ఆధ్యాత్మిక చింతనాంధకార
పూరితం
నిర్జీవ నిప్రాణ సీరవోన్మాద సహితం
దీన హీనోద్విగ్న హృదంతర
ప్రభంజన సహితం
అందుకే
చైతన్య శంఖం పూరించాలి
సమ సమాజ నిర్మాణచణులై
గమించాలి
గుండె లోతుల నుండి భావం
చీల్చుకు రావాలి
వ్యథార్త హృదయాల కోసం
కలం పరుగులు తీయాలి
జనగీతం
జననాదం
జన సాహితీ సృజనం
ప్రజా కవుల ధ్యేయం.

## సంస్కరణ . . . (మైక్రో కథ) జి. నరసింహ మూర్తి

అప్పటికే కొడుకులకూ, కూతుళ్ళకూ యివ్వాల్సింది యిచ్చేశాడు ముందు చూపున్న కోటేశ్వర్రావు.

పెళ్లంతో తనకు విడాకులు కావాలంటూ కోర్టెక్కాడు.

'కొడుకులూ, కోడళ్ళూ, మనవలూ, మనవరాళ్ళూ ఉన్న మనుషులు కదా, ఎందుకొచ్చిన విడాకులు? ఉన్న నాలుగు రోజులూ రగ్గులో దూరి వెచ్చగా మొగుడూ పెళ్ళాలు తొంగోక', అనుకున్నారు కొందరు.

'పోవే వెధవముండా' అని మొగుడంటే 'పోరా వెధవా' అని పెళ్లాం అనేసింది లాయర్ల ముందు.

అంతా కిన్నిరై పోయారు. లాయర్లకి తమ లా పుస్తకాల్లో ఉన్న రూల్సు కన్నా వీళ్ల దెబ్బలాట మంచి యెఫెక్టు నిచ్చింది.

పెళ్లానికి, ఉన్నదాంట్లో సలభై యెకరాల గండేరా యిచ్చేయాలంది కోర్టు.

'భూమి పోయినా పర్వాలేదు. ఈ పెళ్లం పోవాలి' అన్నాడు కోటేశ్వరావు మీసం మెలేస్తూ.

విడాకులూ, రాతలూ కోతలూ అయిపోయిన తర్వాత స్వయంవరంలో నెగ్గిన రాకుమారుడిలా పెళ్లాన్ని తిన్నగా యింటికి తీసుకు తెచ్చుకున్నాడు.

అంతా ముక్కు మీద వేలేసుకున్నారు గుడ్లు తేలేసి.

ఆ దెబ్బతో భూ సంస్కరణల పీడ వదిలిందని మొగుడూ పెళ్లాలు కొత్త దంపతుల్లా కులకడం ప్రారంభించారు.